అది మా చెల్లెలి పెళ్ళిలో జరిగిన సంఘటన. తరచూ జ్ఞాపకం వస్తూం టుంది.

* * *

లంకంత మేడ. చుట్టాలు, బంధువులతో కిక్కిరిసి పోయింది.

తెల్లవారితే పెళ్ళి.

మగపెళ్ళివారు వచ్చేసి విడిదింట్లో వున్నారు.

విందులు, వినోదాలతో సంబరంగా జరిగిపోతోంది. అన్ని అరేంజిమెంట్లూ లోటు లేకుండా జరిపించేరు నాన్నగారు.

నేను కొందరు ఫ్రెండ్స్‌తో కలిసి మేడమీద సరదాగా పేకాడుతూ, అక్కడే నిద్రపోయాను.


ఒక రాత్రివేళ హఠాత్తుగా మెలుకువ వచ్చింది. ఇల్లంతా ఏదో అనూహ్యమైన సందడిలో వున్నట్లనిపించి. మేడ దిగి వచ్చాను. అంతే -



## మినీకధ

# పాపమా! పుణ్యమా!!

### కె. శివారెడ్డి




గుండెలు గుభేలు మన్నాయి.

ఇంట్లోని ప్రతి ఒక్కరూ కాళ్ళుచేతులు కట్టివేయబడి, నోట్లో కుక్కబడిన గుడ్డలతో- చాలా దయనీయంగా వున్నారు. దొంగలెంత మంది వున్నారో ఊహ కందడం లేదు.

అప్పటికే నగలూ, డబ్బూ మొదలైనవన్నీ మూటలుగా కట్టబడి వున్నాయి. ఇంకా లోపలి నుంచి తీసుకొస్తూనే వున్నారు. కొందరు గన్స్ పట్టుకొని సెక్యూరిటీ కోసం నిలబడి వున్నారు.

నేను పరిశీలిస్తూండగానే ఇద్దరు అమాంతం నన్ను ఒడిసి పట్టుకొని లాక్కువచ్చారు. ఆ పరిస్థితిలో నా రివాల్వర్ పనిచేయదని తెలుసు..

నా కాళ్ళు చేతులు కట్టేస్తుండగా లోపలి నుంచి మూటలు తీసుకుని ఐదుగురూ, వారి వెనుక వంకీకర్ర పట్టుకొని ఓ చురుకైన యువకుడూ వచ్చారు.

అతనే ఆజ్ఞలు ఇస్తూండటం వల్ల గ్యాంగ్‌లీడర్ అని తెల్సింది. అతను కట్టి వేయబడుతూన్న నా వైపు ఓసారి చూసి, చూపు తిప్పకోబోయి హఠాత్తుగా ఉలిక్కి పడ్డాడు.

చరచరా నా ముందుకు వచ్చి నిలబడ్డాడు.

నేను కూడా ఆశ్చర్యంతో నిశ్చేష్టుణ్ణయి పోయాను.

"ఆగండి! ఆయన్ని విడిచిపెట్టండి." సంభ్రమంగా అంటున్నాడతను. నామనసు ఏడు సంవత్సరాల క్రిందటి చిన్న సంఘటన నెమరు వేసుకుంది. నా పెళ్ళయిన కొత్తరోజులవి. దొంగల బాధ అంతగా లేదు.

* * *

నేను కచ్చడం బండి కట్టుకొని నా భార్యని తీసుకు రావడాని కెళ్తున్నాను.

మా వూరి నుంచి చిన్నసైజు అడవిలా వున్న ప్రదేశం ఓ పది కి.మీ. దాటితే మా అత్తవారి వూరు వస్తుంది.

దారి మధ్యలో రెండు మూడు చిన్న గ్రామాలు కలుస్తాయి.

ఒక చిన్న గ్రామంలోంచి బయటకు వచ్చి మళ్ళీ అడవిలోకి ప్రవేశించబోతూ హటాత్తుగా కచ్చడం ఆపేశాను.

ఊరి బయట ఒక ఇరవై సంవత్సరాల యువకుడిని పట్టుకొని ఆరుగురు నడివయసు వ్యక్తులు ఎడాపెడా బాదేస్తున్నారు.

ఆ యువకుడు అప్పటికే నురగలు గక్కుతున్నాడు. అయినా అతన్ని వదలడం లేదు వాళ్ళు.

మా పాలేరు కుర్రాడ్ని బండి ముందు నిలబడ మని నేను త్వరగా ఆ చోటికి పరుగెత్తాను.

"ఏయ్, ఆగండి. ఎవరు మీరు? ఆ కుర్రాడ్ని ఒంటరి వాడ్ని చేసి ఎందుకలా హింసిస్తున్నారు!" అరిచాను.

నా గురించి పట్టించుకోలేదు వాళ్ళు. అలాగే బాదేస్తున్నారు.

వాళ్ళ వాలకం చూస్తూంటే చంపేసే వరకూ వదిలేట్లులేరు.

ఇలా కాదని దగ్గరికెళ్ళి ఒకడ్నిటూ, ఒకడ్నటూ లాగేశాను.

అప్పుడు వారి దృష్టి నావైపు తిరిగింది."వీడెవడ్రా.. పుడకలాగా మన పనికి అడ్డొస్తున్నాడు. ముందు వీడి పని కానివ్వండి" అంటూ నలుగురు నావైపు వచ్చారు.

ఇక లాభం లేదు. జేబులోంచి రివాల్వర్ తీసి "ధన్" మని గాలిలోకి పేల్చాను. భయభ్రాంతులై ఆగిపోయారు.

"ఒక్క నిమిషంలో ఇక్కడినుంచి పరుగెత్తక పోయారో, నలుగుర్నీ షూట్‌చేసి పారేస్తాను. ఊ!

కదలండి'' తీవ్రంగా అరిచాను.

"అదికాదు బాబయ్యా! వాడు దొంగండీ. మా ఇళ్ళలో దూరి అన్నీ దొంగిలించుకుపోతున్నాడు.''

నేను కాస్త చలించాను. 'ఓహో. వీడు దొంగ అన్నమాట!' కాని అతడి పరిస్థితి మాస్తే చాలా దయనీయంగా అనిపించింది.

''అతడి సంగతి నేను చూస్తాను. మీరెళ్లండి!'' గదిమాను.

మొత్తంమీద ఎలాగయితేనేం-వారిని పారద్రోలాను. కప్పడం బండీలోంచి మంచి నీళ్ళు తెప్పించి కుర్రాడి కి-సారీ_యువకుడికి శైత్యోపచారాలు చెయ్యగా కొంత సేపటికి తేరుకొన్నాడు.

నీరసంగా లేచి కూర్చున్నాడు.

నిజంగానే అతడి అవతారం హీనంగా వుంది. ముఖం పీక్కుపోయి పిశాచంలా తయారయింది. బట్టలు చిరిగి పేలికలై, మాసిపోయి బయట పడేసే బాపతుగా వున్నాయి.

''ఎవరయ్యా నువ్వు? వాళ్ళు నిన్ను ఎందుకలా చావగొడ్తున్నారు?''

ఫ్లాస్కులోని కాఫీ మా పాలేరు తాగిస్తూండగా అడిగాను.

''దిక్కులేనోడ్ని బాబయ్యా. నన్ను పెంచిన మా, ఒక్క మేనమామా చనిపోయాడు. ఆయన బతికుండగా దొంగతనాలు చేసే వాడని, నేను పని అడిగితే ఎవరూ ఇవ్వలేదు. ఇక కాలే కడుపుతో, ఆగలేక చిన్న చిన్న ఆహార పదార్థాలు దొంగిలించసాగాను. ఇప్పుడిప్పుడే కాస్త పెద్ద దొంగతనాలు కూడా చేస్తున్నాను. ఫర్వా లేదు, బాగానే గడిచిపోతోంది.''

> **క్షార హేల**
>
> రాజకీయ
> సముద్రములో
> ఒడ్డుకు చేరే
> ప్రతి అల
> ఒక క్షార హేల
>
> —అడుసుమల్లి ప్రభాకర్

''ఇలా ఒళ్ళు హూనమవడం కూడా ఫర్వాలేదా! మా ఇంటికి పద. ఏదైనా పని ఇప్పిస్తాను. నీతిగా బతుకుదువు గాని.''

ఆ యువకుడు పేలవంగా నవ్వాడు నేనన్న మాటలకు. ఆ నవ్వులో ఎన్నెన్నో అర్థాలు.

చటుక్కున వంగి నాకో నమస్కారం చేసి అడవి వైపు తిరిగి కుంటుతూ వెళ్ళిపోయాడు.

కాలక్రమేణా ఆ విషయం పూర్తిగా మర్చిపోయాను నేను.

కాని ఇన్నాళ్ళకు.........

"నువ్వు...నువ్వు... చివరకు గజదొంగగా మారావా!''

విస్మయంతో ఇంకేమనాలో తోచలేదు.

నవ్వాడు. అదే నవ్వు. తిరస్కారంతో కూడిన నవ్వు. లోకంమీద పగబట్టి అది తీర్చుకుంటున్నప్పటి నవ్వు.

అతడి సైగ ననుసరించి దొంగలు చకచకా కదుల్తున్నారు.

ఎక్కడి వస్తువులక్కడ యథా ప్రకారం సర్దేశారు. డబ్బూ, దస్కం నా ముందు కుప్పలా పడేసి తన వాళ్లకు సైగ చేశాడు.

''ఆ రోజు మీరు నాకు ప్రాణ భిక్ష పెట్టారు. అలాంటి మీకు ద్రోహం చేయలేను. ఇంతకంటే మేలు కూడా చేయలేనేమో. వస్తాను.''

అయిదు నిమిషాల్లో అంతా కనుమరుగయ్యారు.

ఆ పరిస్థితిలో సంతోషించాలో, విచారపడాలో నాకర్థం కాలేదు.

మా వాళ్ళందరి ముఖాల్లోనూ పోయిన కాంతి తిరిగి వచ్చింది. ఏదేదో అంటూ నన్ను ఆకాశాని కెత్తేస్తున్నారు. అంతా గందరగోళంగా వుంది.

''ఏది ఏమైనా ఒరే రాజా! నీ వల్లనే మన ఆస్తి పాస్తులన్నీ ఈ రోజు మనకు దక్కాయి. నీ చెల్లెలు పెళ్ళి సలక్షణంగా చేయగలుగుతున్నాం. ఆ రోజు నువ్వు అతన్ని రక్షించి వుండకపోతే.........'' అంటున్నారు నాన్నగారు.

'అవును. ఆ రోజు నేను అడ్డుపడక పోయినట్లైతే నిశ్చయంగా చరడు చచ్చిపోయేవాడే. అయితే నేను చేసింది - పాపమా! పుణ్య కార్యమా!!'

ఎటూ నిర్ణయించ లేకపోయాను. ●

